క్లుప్తంగా

ఘనంగా రోఖియాబీ ఉరుసు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

వెలుగోడు: పట్టణంలో రోఖియాబీ ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి దర్గా నిర్వాహకుల ఇంటి వద్ద నుంచి ప్రధాన రహదారి వెంట డప్పు వాయిద్యాలు, బాణా సంచాల మధ్య, అశేష భక్తజనుల సమూహంలో గంధాన్ని ఊరేగింపుగా రోఖియాబీ దర్గా వరకు తీసుకువచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతేహాలు సమర్పించి పూజలు చేశారు. భక్తులు, బంధు మిత్రుల రాకతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎస్‌ఐ భూపాలుడు సీసీ కెమెరాల పర్యవేక్షణలో గట్టి బందోబస్తు నిర్వహించారు. గాజులు, ఆటవస్తువుల దుకాణాలు, మిఠాయి అంగళ్లతో పట్టణం కళకళలాడుతోంది. ఉరుసు సందర్భంగా దర్గాను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆత్మకూరులో వర్షం

ఆత్మకూరు: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన ఈ వర్షం పడటంతో ఎండవేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఉపశమనం కలిగించింది. ఈ వర్షాలు వేసవి దుక్కులకు ఎంతగానో ఉపయోగపడడంతో పొలం పనుల్లో రైతులు బిజీ అవుతున్నారు. ట్రాక్టర్లు, ఎద్దులతో వేసవి దుక్కులను దుక్కి దున్నుకుంటూ, ఎరువులను చల్లుతూ ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు.

భారీ గాలులు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల పరిధిలో శుక్రవారం సాయంత్రం భారీ గాలులతో వర్షం జల్లులు కురిశాయి. ఇప్పటికే పలు పర్యాయాలు భారీ గాలులకు వేలాది ఎకరాల్లో అరటిచెట్లు నేలకొరగడంతో అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మరోసారి భారీగా గాలులు రావడంతో రైతులు ఆందోళన చెందారు.

పిడుగు పాటుకు గడ్డివామి దగ్ధం

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో శుక్రవారం సాయంత్రం పిడుగు పడటంతో గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన చెల్లిమిల్ల రవి కల్లంలో పిడుగుపడటంతో గడ్డివామికి మంటలు వ్యాపించాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు యత్నించగా ప్రయోజనం లేకపోవడంతో ఆత్మకూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు.

రేపు పూర్వ విద్యార్థుల సమావేశం

వెలుగోడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 26వ తేదీ నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు జెఎండీ ఇంతియాజ్ తెలిపారు. 1996-1997వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల సమావేశం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాఠశాలలో చదివిన విద్యార్థులంతా సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం పూర్వ విద్యార్థులు ఇంతియాజ్, మల్లికార్జున, గోపాల్, ఫయాజ్ అహ్మద్, అబ్దుల్ వాహీద్, శ్రీకాంత్, సలీంఖాన్, తదితరులు పర్యవేక్షించారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీశైలం: మల్లికార్జునస్వామి క్షేత్రాన్ని పరిరక్షించే అంకాలమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేసి వివిధ రకాల పుష్పాలు, నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



చెట్టును ఢీకొన్న లారీ

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో చక్కెర లోడ్‌తో వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గిద్దలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రకాశం జిల్లా కంభం వస్తున్న లారీ నల్లమలలోని పురాతన ఇటుకల బ్రిడ్జివద్ద అద్దంకి నుంచి అనంతపురం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న అడవిలోకి దూసుకెళ్లి చెట్టును గుద్దుకుంది. ఈ ఘటనలో బేతంచర్ల మండలం హెచ్.కొట్టాలకు చెందిన డ్రైవర్, ఓనర్ మద్దిలేటితో పాటు బైక్‌పై వెళ్తున్న అద్దంకికి చెందిన అనిల్‌కుమార్, ఉప్పుతల రామకృష్ణ గాయపడ్డారు. విషయం తెలుసుకున్న గిద్దలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి గాయపడిన వారిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


శ్రీశైలంతో ప్రారంభం.. మహానందితో ముగింపు

- జూన్ 4న ఓట్ల లెక్కింపు
- శ్రీశైల పుణ్యక్షేత్ర పరిధిలో 1 నుంచి 13 పోలింగ్ కేంద్రాలు
- మహానంది మండలంలో చివరి కేంద్రం
- గెలుపోటముల్లో ఆత్మకూరు, వెలుగోడు పట్టణాలు కీలకం

ఆత్మకూరు: జూన్ 4వ తేదీన నిర్వహించే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నంద్యాల పట్టణంలోని ఆర్‌జీఎం కళాశాలలో ఉన్నతాధికారులు భారీ బందోబస్తు మధ్య జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. కాగా శ్రీశైలం నియోజకవర్గానికి సంబంధించి శ్రీశైలం నుంచే ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. మహానంది మండలంతో చివరి రౌండ్ ముగుస్తుంది.

తొలిరౌండ్ శ్రీశైలం క్షేత్రం నుంచి..

శ్రీశైలం నియోజకవర్గంలో ఓట్ల లెక్కింపు తొలి టేబుల్, తొలి రౌండ్ శ్రీశైలం మహాక్షేత్రానికి సంబంధించి పోలింగ్ కేంద్రం నుంచి ప్రారంభం అవుతుంది. 1వ పోలింగ్ పోలింగ్ కేంద్రం శ్రీశైలం కాగా, 226 చివరి పోలింగ్ కేంద్రం మహానంది మండలంలోని బసాపురంతో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది. శ్రీశైలంలోని 1వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 538 ఓట్లు పోలయ్యాయి. 1 నుంచి 13 వరకు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చెందిన పోలింగ్ బూత్‌లు కాగా, 14వ పోలింగ్ కేంద్రం నుంచి 27 వరకు సున్నిపెంటకు చెందినవి ఉన్నాయి.



శ్రీశైలం నియోజకవర్గ మ్యాప్

28 నుంచి ఆత్మకూరు మండల పోలింగ్ కేంద్రాలు

28వ పోలింగ్ కేంద్రం ఆత్మకూరు మండలం బైర్లూటీ నుంచి ప్రారంభమవుతుంది. ఆ తరువాత ఆత్మకూరు పట్టణంలో వరుసగా 45 నుంచి 81 వరకు పోలింగ్ కేంద్రాల ఓట్లు లెక్కిస్తారు. అనంతరం 82 నుంచి 97వ పోలింగ్ కేంద్రం వరకు మళ్లీ ఆత్మకూరు మండలానికి చెందిన ఓట్ల లెక్కింపు ఉంటుంది. 98వ పోలింగ్ కేంద్రం వెలుగోడు మండలంలో ప్రారంభమై 144వ వరకు, 145 నుంచి 189 పోలింగ్ కేంద్రాలు బండిఆత్మకూరు మండలంలో ఉన్నాయి. మహానంది మండలం 190 పోలింగ్ కేంద్రం నుంచి ప్రారంభమై 226వ పోలింగ్ కేంద్రంతో ముగియగా.. బూత్‌ల వారీగా లెక్కింపు కొనసాగుతుంది. ఇలా వరుసగా శ్రీశైలం నుంచి ప్రారంభమై మహానంది మండలంతో ఓట్ల లెక్కింపు పూర్తి అవుతుంది.

నియోజకవర్గంలో 1,62,760 ఓట్లు పోల్

శ్రీశైలం నియోజకవర్గంలో మొత్తం 1,96,116 ఓట్లు ఉండగా, ఇందులో పురుషులు 80,355 మంది, మహిళలు 82,379 మంది కాగా, ట్రాన్స్‌జెండర్స్ 26 మంది ఉండగా.. మొత్తం 1,62,760 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో ఈసారి భారీగా పోలింగ్ జరిగింది.

ఆత్మకూరు, వెలుగోడు పట్టణాలు కీలకం

ఓట్ల లెక్కింపులో వివిధ గ్రామాలు, ఆత్మకూరు, వెలుగోడు పట్టణాలు అత్యంత కీలకంగా ఉన్నాయి. ఆత్మకూరు, వెలుగోడు పట్టణాల్లోని ఓటర్లు గెలుపు, ఓటములను శాసించనున్నారు. అయితే ప్రజల నాడి ఇరువర్గాల మధ్య స్పష్టంగా ఏ పార్టీకి మొగ్గు చూపారన్నది ఎవరూ తేల్చలేకపోతున్నారు. పోలింగ్ బాక్సుల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవిష్యత్ జూన్ 4వ తేదీతో తేలనుంది. ఓట్ల లెక్కింపుపై అభ్యర్థులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గెలుపు, ఓటములపై ఎవరి ధీమా వారిదే..

శ్రీశైలం నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు, ఓటములపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి తన సమీప ప్రత్యర్థి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై 15 వేల నుంచి 20 వేల మెజార్టీ సాధిస్తారని, అంతకంటే భారీగా మెజార్టీ వచ్చే అవకాశం ఉందని వైఎస్సార్‌సీపీ అభిమానులు పేర్కొంటున్నారు. కాగా టీడీపీ మద్దతుదారులు తమ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి శిల్పా చక్రపాణిరెడ్డిపై 5 వేల ఓట్లకు పైగా విజయం సాధిస్తారని చెబుతున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొత్తపల్లి: పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ జవహర్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, కొత్తపల్లి సచివాలయాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కొందరు సిబ్బంది రిజిస్టర్లో సంతకాలు చేసి విధుల్లో లేకపోవడం, సచివాలయంలో లేకపోవడం, క్యాంపుల పేరుతో బయటికి వెళ్లడం వంటివి చేస్తున్నారని గమనించారు. విధుపట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఎనిమిది మంది సిబ్బందికి నోటీసులు జారీ చేశారు. మూడురోజుల లోపు వారు సంజాయిషీ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

ఏజెన్సీ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

మహానంది: మహానందీశ్వరుడి దేవస్థానంలోని ఏజెన్సీ విభాగంలో పనిచేస్తున్న 30 మంది ఏజెన్సీ సిబ్బందికి విధులు మారుస్తూ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈఓ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం విధుల్లో మార్పులు చేశామన్నారు. సమాచార కేంద్రం, వసతిగృహాల విభాగం, వివిధ ఆర్జిత సేవా కౌంటర్లలో పనిచేస్తున్న సిబ్బందికి స్థాన చలనం కలిగించామని చెప్పారు. ఎవరికి కేటాయించిన విధుల్లో వారు చేరాలని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



మాట్లాడుతున్న వైకేపీ అదనపు ప్రాజెక్టు ఆఫీసర్ సలాం

జూపాడుబంగ్లా: ప్రకృతి వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన ఆహార పదార్థాలను పండించవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ సలాం తెలిపారు. శుక్రవారం జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మనం తింటున్న ఆహారధాన్యాలలో రసాయన మందుల అవశేషాలు అధికంగా ఉండటం వల్ల తినే ఆహారం విష తుల్యంగా ఉంటుందన్నారు. పంటల సాగులో రైతులు రసాయన మందుల వాడకం అధికం కావటంతో భూమి సాంద్రత కూడా దెబ్బతినటంతో దిగుబడులు తగ్గిపోతున్నాయని చెప్పారు. అంతేకాకుండా పండించే ఆహారధాన్యాలు విషతుల్యం కావటంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. రైతులు పెట్టుబడులు తగ్గించుకొని స్వచ్ఛమైన దిగుబడులను సాధించాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. గ్రామాల్లోని రైతులతో పాటు పొదుపు మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి వారిని ఆదిశగా ప్రోత్సహించాలని ఏపీఎం అంబమ్మ, వైకేపీ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, వీఓఏ లకు సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఫెసిలిటేటర్ అయ్యన్న, సీసీలు నాగన్న, గాంధీ, విజయలక్ష్మి, నాయక్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఉన్న విత్తనాలనే విక్రయించాలి



నందికొట్కూరులో సీడ్స్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ షేక్షావలి

కొత్తపల్లి: విత్తన దుకాణాదారులు అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని ఏఓ కె.మహేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొక్కెరంచ, నాగంపల్లి గ్రామాలలోని విత్తన దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రిజిస్టర్లను, బిల్‌బుక్‌లను, లైసెన్స్ పత్రాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, విత్తన నిలువలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుకాణదారులు అమ్మే విత్తనాలకు సరైన పత్రాలు ఉండాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించకూడదని, రైతులకు బిల్లు తప్పకుండా ఇవ్వాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చించారు.

నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలి

నందికొట్కూరు: నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి షేక్షావలి సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు దుకాణాలను ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి విత్తనాలలో హెచ్‌టీ కాటన్ ఉందా లేదా అని మండల అధికారి టెస్ట్ చేయగా నెగిటివ్ రిజల్ట్ వచ్చేసింది. నకిలీ విత్తనాలు రైతులకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీవాలకు టీకాలు వేయించాలి



ఎద్దుకు టీకాలు వేస్తున్న పశువైద్యశాఖ అధికారులు

జూపాడుబంగ్లా: ఆవులు, గేదెలు తదితర జీవాల్లో గొంతువాపు, జబ్బవాపు, చిటికె వ్యాధుల నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంటు డైరెక్టర్ రామాంజనేయనాయక్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెల్లజాతి పశువులైన ఆవులు, ఎద్దులు, ఆవుదూడలకు జబ్బవాపు వ్యాధి సంక్రమించే అవకాశాలున్నందున వ్యాధినివారణకు ముందస్తు చర్యగా బ్లాక్‌క్వార్టర్ అనే టీకాను ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. అలాగే నల్లజాతి పశువులైన గెదెలకు గొంతువాపు వ్యాధి నివారణ నిమిత్తం హేమరేజిక్ సెప్టిసేమియా అనే టీకాను వేస్తున్నామని చెప్పారు. మేకలు, గొర్రెలు,పొట్టేళ్లకు వ్యాపించే చిటికె వ్యాధి నివారణకు ఎంటరోటాక్సిమియా అనే టీకాలను వేస్తున్నట్లు తెలిపారు. మండలం వ్యాప్తంగా 1,680 తెల్లజాతి పశువులుండగా ఇప్పటిదాకా 650లకు, నల్లజాతి పశువులు 3,583 ఉండగా ఇప్పటిదాకా 500 పశువులకు టీకాలు వేసినట్లు వెల్లడించారు. 22,633 జీవాలుండగా వాటికి రెండు రోజుల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో శుక్రవారం నిర్వహించిన వారాంతపు సంతలో కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో వినియోగదారులు అరకొరగా కొనుగోలు చేశారు. ఏప్రిల్ మాసం, మే రెండు వారాల్లో వర్షాల్లేక పోవడంతోపాటు బోర్లు, బావుల్లో భూగర్భజలాలు అడుగంటడంతో సాగుచేసిన కూరగాయల తోటలకు సాగునీరు సక్రమంగా అందక దిగుబడులు లేవని రైతులు పేర్కొంటున్నారు. ఈనేపథ్యంలో కూరగాయలు అడపా దడపా లభిస్తుండటంతో వ్యాపారులు వాటిధరలు పెంచి విక్రయిస్తున్నారు. కిలో పచ్చిమిర్చి రూ.100, టమోటా రూ.50, బెండ కిలో రూ.60, చెవుల కాయ రూ.60 ఇలా ఏకూరగాయ కొన్నా రూ.60లు పైబడి ధర చెప్పటంతో వినియోగదారులు కూరగాయలు కొనడానికి సతమతమయ్యారు. కిలో కొనుగోలుచేసే వారు అరకిలోతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు మొదటి సంవత్సరం పరీక్షలకు 118 మంది విద్యార్థులకు గాను 115 మంది, సెకండ్ ఇరియర్ పరీక్షలకు 79 మందికి గాను 68 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షకు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ షెక్షావలి తెలిపారు.

తెలుగు పరీక్షకు ఒకరు గైర్హాజర్

జూపాడుబంగ్లా: మండల కేంద్రమైన మోడల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రంలో శుక్రవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం ఇంటర్ ఫస్టియర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం నిర్వహించిన ఫస్టియర్ తెలుగు పరీక్షకు 17 మంది విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం చీఫ్ రమేష్ తెలిపారు. మధ్యాహ్నం ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షకు కేవలం ఓ విద్యార్థి మాత్రమే హాజరైనట్లు తెలిపారు.

ప్రశాంతంగా పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నందికొట్కూరు: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ కోసం రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు 247 మంది విద్యార్థులకు గాను 93 మంది పరీక్షకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు పరీక్షకు 127 మందికి గాను 48 మంది, గవర్నమెంట్ హైస్కూల్‌లో 120 మందికి గాను 45 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాశారు.

పదో తరగతి పరీక్షలకు 57 మంది గైర్హాజరు

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు 119 మందికి విద్యార్థులకు 57 మంది, ఉర్దూ పరీక్షకు 5 గురికి 5 గురు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి సాయితిమ్మయ్య, డిపార్టు మెంటల్ అధికారి మహేష్ తెలిపారు.

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 15 మందికి 14 మంది, ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు 9 మందికి 9 మంది హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ప్రభాకర్, డిపార్టుమెంటల్ అధికారి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



ఏ.కోడూరులో పారిశుద్ధ్య పనులు చేపడుతున్న పారిశుద్ధ్య కార్మికురాలు

మహానంది: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేస్తున్నట్లు పార్నపల్లె, ఏ.కోడూరు గ్రామాల సర్పంచులు షేక్ షబ్బీర్ అహమ్మద్, మన్నె జ్ఞానాభరణం తెలిపారు. రెండు గ్రామాల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని ప్రధాన కాల్వలు, వివిధ కాలనీలలో ఉన్న కాలువల్లో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. వారు మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

ముగిసిన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు



ధార్మిక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వెలుగోడు: స్థానిక అయపురెడ్డి నగర్‌లో వెలసిన శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం భగవద్గీతలపై మద్దయ్య స్వామి చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను అలరించాయి. ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ , కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు బళ్లాని వెంకటసత్యనారాయణ, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భజన మండలి అధ్యక్షుడు తెలుగు నాగలక్ష్మమ్మ, జ్యోత్స్న, సాలమ్మ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రథమ వార్షికోత్సవం

శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బళ్లాని వెంకటసత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం సుదర్శన మహా మృత్యుంజయ హోమం, మహాబలి పూర్ణాహుతి, 108 కేజీల పులిహోరతో స్వామి వారికి తిరుప్పావడ సేవ, సాయంత్రం 5గంటలకు శ్రీనివాస కల్యాణం, తదనంతరం భక్తులందరికీ మహా ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పల్లకీలో మహానందీశ్వరుడి విహారం



మహానందిలో పల్లకిసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, బలిహరణ పూజల అనంతరం స్వామి, అమ్మవార్లు ఆలయ ప్రాకారాల్లో విహరించారు.

తగ్గనిరద్దీ

మహానందిలో భక్తులరద్దీ తగ్గడం లేదు. వేసవిసెలవులు ఉండటంతో వేలాది సంఖ్యలో భక్తజనం తరలివస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

అన్నప్రసాద కేంద్రానికి 120 బస్తాల బియ్యం విరాళం

మహానంది దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ కేంద్రానికి నంద్యాల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతులు సహకరించినట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, సిబ్బంది శుక్రవారం గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడి బియ్యం బస్తాలను సేకరించారు. పలువురు రైతులు ప్రస్తుతం 35 బస్తాల బియ్యం విరాళంగా ఇచ్చారని, మరికొందరు కలిసి మొత్తం 120 బస్తాల బియ్యం ఇస్తామని ముందుకు వచ్చినట్లు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామసభలో మాట్లాడుతున్న రూరల్ సీఐ విజయభాస్కర్

మిడుతూరు: శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించమని, చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం మండలపరిధిలోని సుంకేసుల గ్రామంలో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ క్షణికావేశంలో చిన్నపాటి గొడవలకు వెళ్లి అనవసరంగా కేసుల్లో చిక్కుకోవద్దని సూచించారు. పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి వారి ఉజ్వల భవిష్యత్తుకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జగన్ మోహన్, జయశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కటకటాలే

మహానంది: ఎన్నికల ఫలితాల రోజున రాజకీయ పార్టీల నాయకులు గ్రామాల్లో ఘర్షణకు దిగితే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని బండిఆత్మకూరు, గోస్పాడు ఎస్‌ఐలు మల్లికార్జున, నాగార్జునరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మహానంది మండలం సీతారామపురం గ్రామంలో సిబ్బందితో కలిసి పర్యటించారు. గ్రామస్తులతో వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల రోజున గ్రామంలో ప్రజలు గుంపులు, గుంపులుగా ఉండటం, ఉత్సవాలు చేసుకోవడం నిషేధమన్నారు.

ఘనంగా పారువేట మహోత్సవం

మిడుతూరు: శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పారువేట మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు సుబ్రమణ్యం శర్మ, ఆలయ పురోహితులు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఆలయంలో తీర్థావలి, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించిన అనంతరం అశ్వవాహనంపై ఆశీనులను చేసి ఆలయ ప్రాంగణం నుంచి గ్రామ శివారులో ఉన్న పారువేట మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. పారువేట కార్యక్రమం సాంప్రదాయ బద్ధంగా నిర్వహించిన అనంతరం స్వామివారిని గజవాహనంపై ఆశీనులను చేసి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఏడీ వెంకటరమన, భక్తులు పాల్గొన్నారు.

గువ్వలకుంట్లలో పారువేట ఉత్సవం

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో ఈశ్వరస్వామి తిరునాల సందర్భంగా నాల్గవరోజు శుక్రవారం పారువేట ఉత్సవాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రీ, గ్రామపెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులతో కలసి ఆలయంలో శివపార్వతుల ఉత్సవమూర్తులను పూలమాలలు, నూతన వస్త్రాలతో అలంకరించి విశేషపూజలు చేశారు. ఉత్సవమూర్తులను పల్లకీలో వేయించింపజేసి గ్రామనలుమూలల భాజాభజంత్రీలతో ఊరేగించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరిబయటకు తీసువెళ్లి అక్కడ పారువేట ఉత్సవాన్ని ప్రారంభించారు. గువ్వలకుంట్ల గ్రామపంచాయతీ మజరా బండినాయినిపాలెం గ్రామానికి చెందిన తలారి శీను కుమారుడు చరణ్ అనే యువకుడు పారువేట గొర్రెను పట్టుకొని విజయం సాధించాడు. గ్రామ పెద్దలు ఆ యువకుడిని అభినందించారు.



మిడుతూరులో ఉత్సవమూర్తులను అశ్వవాహనంపై పారువేట మండపం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం



గువ్వలకుంట్లలో పారువేట ఉత్సవంకోసం పల్లకీలో ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్న భక్తులు